# నేనెవరికోసం బ్రతకాలి?

ముమ్మిడి శ్యామలారాణి



"మురళీ ... మురళీ" అని తలుపు దబదబా కొట్టసాగాడు శేఖర్.

"వస్తున్నా ..." అని తలుపు తీసిన ఇందిర రెండు అడుగులు వెనక్కివేసి, "అన్నయ్య లేడండి" అంది.

"మురళీ లేడాండీ, ఐదు గంటలకు వస్తాను అని చెప్పానే, ఎక్కడికి వెళ్ళాడో మీతో చెప్పాడా ?" అని లోపలికి అడుగుపెట్టాడు శేఖర్.

లోపలికి వస్తున్న శేఖర్‌వైపు బెదురుగా చూస్తూ "నాతో ఏమీ చెప్పలేదండి, అరగంట క్రితం ఎవరో మోటారుసైకిల్‌మీద వచ్చారు. ఇద్దరు కలిసి వెళ్ళారు" అంది.

"ఓహో ! వాడా ! ప్రసాద్‌తో వెళ్ళాడు. కొంచెంసేపు వెయిట్ చేస్తాను, వస్తాడేమో" అన్నాడు.

"అ ... కూర్చోండి. ఇంట్లో ఎవరులేరు. అమ్మ, నాన్నగారు గుడికి వెళ్ళారు" అని అంది ఇందిర, కొంచెం కంగారు మిళితమైన స్వరంతో.

ఇందిర కంగారు చూస్తున్న శేఖర్ పెదాలపై నవ్వు బయలుదేరింది. "మీరు అలా ఎందుకు కంగారు పడుతున్నారో అర్థం కావడంలేదు. అఫ్‌కోర్సు నేను వెయిట్ చేయడం మీకేమైన అభ్యంతరం అయితే వెళ్ళిపోతాను చెప్పండి" అన్నాడు శేఖర్.

"అబ్బే ... అదేం కాదండి. మీరు ... మీరు కూర్చోండి. కాఫీ తీసుకువస్తాను" అని లోపలికి వెళ్ళింది ఇందిర.

ఇందిర కంగారు, తననుండి తప్పించుకోవడానికి కాఫీ తెస్తాను అని వెళ్ళిపోవడం నవ్వు తెప్పించాయి శేఖర్‌కి. అందమైన పాలరాతి బొమ్మలా, తాకితే కందిపోయేలా ఉన్న గులాబి పువ్వులాంటి శరీరంతో ఉన్న ఇందిరను చూస్తుంటే ఈ రోజే కాదు రెండేళ్ళుగా అంటే ట్రాన్స్‌ఫర్ అయి వచ్చి విశాఖపట్నంలో మురళీ మెడికల్ కాలేజీలో జాయిన్ అయినప్పటినుండి ఇందిరను చూస్తుంటే మనసులో ఏదో తీయని కోరికలు బయలుదేరుతున్నాయ్! ఇందిర తన స్వంతమైతే అంతకన్నా జీవితంలో తనకి కావలిసినదేముంది ? కాని... చూస్తూ ఏ అమ్మాయి అందులో అందమైన అమ్మాయి తనని వివాహం చేసుకోవడానికి అంగీకరిస్తుంది ? అన్నీ ఇచ్చి భగవంతుడు తననుండి అందానిని ఎందుకు దూరం చేసాడో ! జీవితంలో మొదటిసారిగా తను దెబ్బతిన్నాడు. ఎంత మరచిపోదామన్న ఆ సంఘటన ఇప్పటికి మరచిపోలేకపోతున్నాడు.

*　　　*　　　*

మెడిసన్ నాలుగవ సంవత్సరం చదువుతున్న రోజులు. మెడికల్ కాలేజి బ్యూటి అయిన లత అందం తనని పిచ్చివాడిని చేసింది. 'లతని తను వివాహం చేసుకుంటే' అన్న కోరిక తనలో బయలు దేరింది. లత అందం అలాంటిది. అందుకే ఆ రోజు తన మనసులో కోరిక లతతో చెప్పాలని నిర్ణయానికి వచ్చాడు.

"ఏమండి! మీతో ఒకసారి మాట్లాడాలి. మీకేమైన అభ్యంతరమా" అన్నాడు.

ఒక్క నిముషం కళ్ళెత్తి శేఖర్ ముఖంలోకి చూసిన లత "వ్వాట్ ! నాతో మాట్లాడతారా ? మాట్లాడడానికి మీకు నాకు ఏమున్నాయ్! అయినా ఏదో మాట్లాడాలి అంటున్నారు. కాబట్టి చెప్పండి? క్విక్ ! అవతల నాకోసం ఫ్రెండ్స్ వెయిట్ చేస్తున్నారు" అంది లత.

చెప్పాలి అనుకున్నది చెప్పడానికి కొంచెం భయపడ్డాడు శేఖర్, కాని చెప్పక తప్పదు. లత తన

అర్ధాంగి అయితే అంతకన్నా కావలసినదేముంది ?

"అరె... వ్వాట్ శేఖర్ ! ఏదో మాట్లాడాలి అని ఆలోచనల్లో పడ్డారు" అని గలగలా నవ్వింది.

ఆ నవ్వుకి పారవశ్యం అయిపోయాడు శేఖర్. "నా మనసులో మాట చెబుతున్నాను. మీరు నన్ను అపార్థం చేసుకోకండి. ఐ లౌ యూ" అన్నాడు.

ఎర్రబారిన కళ్ళతో తీక్షణంగా శేఖర్ వైపు చూసి "వ్వాట్... నువ్వు అంటున్నది ఏమిటి" అంది.

"అవును లతా. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. మీకభ్యంతరం లేకపోతే నేను మిమ్మలను వివాహం చేసుకుంటాను."

"వ్వాట్ మిస్టర్ ! నువ్వు ... నన్ను ప్రేమించడమా ? బట్ నేను నిన్ను ప్రేమించడం లేదే ! కాని ఒకమాట. నువ్వు చాలా పేరాశకు పోయావ్ ! ఐ మీన్ నిజం చెప్పాలంటే నేనే కాదు. ఏ అమ్మాయి అందులో, నాలాంటి బ్యూటీ గరల్ చూస్తూ ... చూస్తూ నిన్ను వివాహం చేసుకోవడానికి అంగీకరించదు. నాకు లక్షలు ఆస్తి ఉండవచ్చు, ఫారిన్ కారు ఉండవచ్చు. కాని ... అవన్నీ ఏ స్త్రీ కోరదు. ఒకవేళ ఏ అమ్మాయి అయినా నిన్ను పెళ్ళి చేసుకుందే అనుకో ! నిన్ను చూసి మాత్రం కాదు ... నీ ఆస్తి ... నీ కారు ... వగైరా ... వగైరా ... బై" అంటూ చరచరా వెళ్ళిపోయింది అక్కడనుండి లత.

* * *

"ఏమండి ! ... సారీ ... ఏమీ అనుకోకండి. ఇంట్లో ఎవరు లేరన్న అభిప్రాయంతో అలా అన్నందుకు మీరు బాధపడుతున్నట్లున్నారు. క్షమించండి" అని కాఫీ కప్పు టీపాయ్‌మీద పెట్టింది ఇందిర.

శేఖర్ ఆలోచనల నుండి తేరుకున్నాడు. ఆ సంఘటన తలచుకుంటే ఇప్పటికీ అవమానంతో నిండిపోతుంది తన ముఖం. ఇందిర తను అలా అన్నందుకు అనుకుంటోంది.

"కాఫీ చల్లారిపోతుంది తీసుకోండి. మీరు నేను అడిగినదానికి సమాధానం చెప్పనేలేదు" అంది మెల్లగా ఇందిర.

# నే నెవరికోసం బ్రతకాలి ?

తన మనసులో కోరిక బయటపెట్టడానికి భయపడుతున్న శేఖర్‌కి ఇందిర ప్రవర్తన, వినయ విధేయతలు వేయి ఏనుగుల బలాన్ని ఇచ్చింది.

"అబ్బే ... నేను ఏమీ అనుకోలేదండి. కాని నేను మీతో కొంచెం...మీతో కొంచెం...మాట్లాడాలి అనుకుంటున్నాను. మీరు ఏమీ అనుకోరు కదా" అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది ఇందిర. ఆ కళ్ళలో ఏదో తెలియని భయం నెమ్మది, నెమ్మదిగా చోటు చేసుకోవడం ప్రారంభించింది.

"మీరు ... దయుంచి ఒక్క నిముషం కూర్చోండి. మిమ్మలినే ... ప్లీజ్."

తప్పనిసరియై కూర్చుందేకాని ఇందిర ముఖంలో భయాందోళన రేఖలు కొట్టవచ్చినట్లుగా కనబడుతున్నాయ్ !

"నేను మీతో ఈరోజు మాట్లాడాలి అనుకున్న మాటలు రెండేళ్ళుగా అనుకుంటున్నాను, అనే చెప్పాలి" అని ఇందిరవైపు చూసాడు.

వేటగాడిని చూసిన లేడిలా తల క్రిందకు దించి ఉన్నప్పటికి ఇందిర కళ్ళు బెదురుతున్నట్లు కనిపించింది శేఖర్‌కి.

ఇందిర ముఖం చూస్తున్న శేఖర్ ఆ నిముషంలో చెప్పదలచుకున్నది ఏమిటో త్వరగా చెప్పాలని నిర్ణయానికి వచ్చాడు

"నేను చెప్పేది మీరు విని నా ఆశ చూసి ఆశ్చర్యపోతారో లేక చిరాకుపడతారో మీ ఇష్టం. మనిషి ఆశాజీవి కదా ! ఆస్తి – అంతస్తు, చదువు – హోదా అన్నీ ఉన్న నేను ఒక అందమైన అమ్మాయికి భర్తగా అయితే అంతకన్నా నాకు జీవితంలో కావలసినది ఏమీ లేదు అనిపిస్తుంది. కాని ఆ అందమైన అమ్మాయి నన్ను... అంటే నాలాంటి అందం లేనివాడిని చేసుకోవడానికి అంగీకరించక పోవచ్చు ! అంగీకరించవచ్చు ! నా అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మురళిని అడుగడానికి భయం వేసింది. అందుకే నేరుగా మిమ్మలను అడుగాలి అని అనుకుంటున్నాను. ఇన్నాళ్ళకి ఈ అవకాశం దొరికింది.

నన్ను... నన్ను... మీరు వివాహం చేసుకోవడానికి అంగీకరించగలరా ?" అన్నాడు.

భయంగా చూస్తున్న ఇందిర చటుక్కున కుర్చీలోంచి లేచి నిలబడింది.

"ప్లీజ్ !... మీరు ఒక్క నిముషం కూర్చోండి" అన్నాడు అర్థింపుగా శేఖర్.

"మీరు నా తొందరపాటుని అపార్థం చేసుకోకండి. నేను ఎటువంటివాడినో నా గురించి వివరాలు మురళికి తెలుసు. నాకున్న ఆస్తి – అంతస్తు మీద కోరిక లేదనే చెప్పాలి. నేను జీవితంలో పొందాలి అనుకున్నది ఒక్కటే ! చదువు – సంస్కారంతోపాటు అందమైన మీలాంటి అమ్మాయిని నా భాగస్వామిగా పొందాలి అని ఆరాటపడుతున్నాను. కాని... నేను అలాంటి కోరిక కోరడం హాస్యాస్పదం ఏమో అని ఇప్పుడిప్పుడే అనిపిస్తుంది. దానికి కారణం నా రూపం అనే చెప్పాలి. సారీ !... మిమ్మలను తొందరపడి అడిగినందుకు క్షమించండి. మీరు నా ప్రశ్నకి సమాధానం చెప్పలేరు" అని కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

"ఏమండీ !... " అని ఊహించని సంఘటనకి బెదురుతున్న కళ్ళని అదుపులోకి పెట్టాలన్నట్లు తీక్షణంగా శేఖర్ ముఖంలోకి చూసి ... "మీరు నా మౌనాన్ని మరో విధంగా అర్థం చేసుకున్నారు. మీ గురించి మీరే ఏవేవో ఊహించుకుంటున్నారు. అది పొరపాటు. భార్యభర్తలు ఏ అరమరికలు లేకుండా సుఖ సంతోషాలతో జీవితాంతం గడపడానికి ఒక్క అందచందాలే ముఖ్యమంటారా ? ఈ విషయంలో మీరు పొరపడ్డారనే చెప్పాలి. కాని ... మీరు అడిగిన ప్రశ్నకి జవాబు నేను ఒక్కదానిని చెబితే సరిపోదు. అమ్మ, నాన్న, అన్నయ్య వీళ్ళందరూ ఉన్నారు. నేను తొందరపడి ఏ సమాధానం చెప్పలేను. అందుకు క్షమించండి. మీరు చెప్పదలచుకున్నది ఏమిటో అన్నయ్యతో చెప్పండి" అంది.

అనుకోని జవాబు ఇందిర నోటి వెంట రావడంతో శేఖర్ మనసు సంతోషంతో నిండి పోయింది. ఎంత సంస్కారంగా, ఎంత అందంగా జవాబు చెప్పింది. "చాలా థాంక్సండి ! మీ సమాధానం ఇలా ఉంటుంది అని నేను ఊహించనే లేదు. నేను వెళతానండి" అని వెళ్ళిపోయాడు.

* * *

"ఉండరా ! ... మధ్య నీ వేళాకోళం ఏమిటి? అసలు దానిని అడుగనీయ్ ! దాని అభిప్రాయం వినకుండా ఏమిటిరా నీ అల్లరి. అయినా మన ఇందిర లాంటి అందమయిన దానికి ఆ అబ్బాయి జోడు ఏం బాగుంటుందిరా ? ఇందిర అసలు ఒప్పుకోదు! ఏదో మొహమాటానికి మనని అడగమని ఉంటుంది" అంది శాంతమ్మ.

"నువ్వన్నట్లు శేఖర్ పెద్దగా బాగోదుకాని మనిషికి ముఖ్యమైనది ఒక్క అందమే కాదమ్మా. లక్షలకు విలువచేసే ఆస్తి ఉంది. అన్నింటికన్నా విలువైనది, చాలా మంచివాడమ్మా! రెండేళ్ళబట్టి చూస్తున్నాను. ఈ క్వాలిఫికేషన్స్ అన్నీ చూసి ఇందిర శేఖర్‌ని



ఇష్టపడింది ఏమో ! అమ్మా ! నాకు శేఖర్ అంటే ఎందుకో తెలియదు మంచి అభిప్రాయం ఏర్పడింది. మనం ఎంత చూసుకొన్న కొంచెం అందం తక్కువని ఆలోచించాలిగాని...''

''కాని లేదు గీని లేదు... ఇందిరకేం తక్కువ అని చూస్తు చూస్తూ ఆ అబ్బాయి కెలా ఇందిరను పెళ్ళి చేస్తాం ? ఆస్తి — అంతస్తు, చదువు ఉండచ్చు. ఇందిర బంగారు బొమ్మలా ఉంటుంది. అబ్బాయి నలుపు. వర్ఛనాలిటీ బాగానే ఉంటుంది కాని ఏమైనా ఇందిరకు శేఖర్ ఈడు — జోడు ఏం బాగుంటుందిరా ?'' అన్నారు వేంకటేశ్వరరావుగారు.

''మనం లజ్జు గుజ్జు లాడుకోవడం దేనికండి ? అమ్మాయిని అడిగితే పోలా ? ఏ సంబంధం వచ్చినా ముందు అమ్మాయి అభిప్రాయం అడుగుతాం కదండి ? అట్లాగే అబ్బాయి గురించి అడిగితే సరిపోతుంది. ఆ అబ్బాయికి చెప్పడానికి బాగుంటుంది. ఇందిరా !... ఒకసారి ఇలా రా అమ్మా ! మా అందరికి అబ్బాయి చదువుకున్నవాడు — బుద్ధిమంతుడు, ఆస్తి — అంతస్తు ఉన్నవాడు. మంచి సంబంధమే అన్నివిధాల అనిపిస్తుంది. కాని ఎటొచ్చి ఈడు జోడు అంటారే అబ్బాయి...''

* * *

''అమ్మగోరు ! పని అయిపోనాది. ఎల్లిపోతానండి'' అంది పనిమనిషి రంగమ్మ.

మంచంమీద బోర్లా పడుకొని కన్నీటిధారల మధ్య ఆలోచనల గతంలోకి వెళ్ళిన ఇందిర చప్పున మంచంమీదనుండి లేచి రంగమ్మకి ముఖం కనబడకుండా వెనక్కి తిరిగి ''అలాగే మధ్యాహ్నం తొందరగ రా... లక్ష్మిని తలుపు వేయమను'' అంది ఇందిర.

ఇందిర ముఖం చాటుచేసుకోవడం రంగమ్మకి క్రొత్త కాదుగాని అమ్మగోరి ముఖం ఎప్పుడు కళకళలాడేటట్లు భగవంతుడు చూస్తాడో అనుకొంది రంగమ్మ.

రంగమ్మ గుమ్మం దాటగానే ఇందిర మనసులో ఆలోచనలు బయలుదేరాయ్ ! అమ్మ, నాన్న, అన్నయ్యకి శేఖర్ సంబంధం పెద్దగా ఇష్టం లేకపోయినా తను భవిష్యత్‌ను ఊహించుకొంది. శేఖర్‌ని వివాహం చేసుకోవడానికి అంగీకరించడానికి కారణం తనకి ఎదురైన సంఘటనలే ! కాని అన్నీ ఆలోచించి వివాహం చేసుకున్న తనకి మిగిలింది ఏమిటి ? అశాంతి... ఆ వే ద న ... నిరాశ — నిస్పృహలు. ఎంతో మంచివాడనుకొన్న శేఖర్‌లో అనుమానం. ఏ స్త్రీ భరించలేనిది ! అడుగడుగున అనుమానాలతో వేధించడం. ముందురోజు జరిగిన సంఘటనలో ఎంత వెతికినా అనుమానించ తగ్గది ఏమీ కనిపించడం లేదు. ఎంతో దూరం నుండి శేఖర్ కోసం ఇల్లు వెతుక్కుంటూ వచ్చిన స్నేహితుడికి లక్ష్మిచేత కాఫీ పంపడం తప్పా ? అయినా అంత సాహసం చేయకపోవును. అప్పుడే కాఫీ త్రాగుతోంది. ఇంటికి వచ్చిన వ్యక్తికి కాఫీ ఇవ్వడంలో కూడా వేరే అర్థం తీసుకోవాలా ? ఆ వచ్చిన వ్యక్తి తిరుగుబోతట ... అన్ని లక్షణాలు ఉన్నవాడట. తను వాడి అందచందాలు చూసి ... ఆ వచ్చిన వ్యక్తిని తనవైపు... ఛ ... ఛ ... ఇంటికి వచ్చిన వ్యక్తి మంచివాడైన... చెడ్డవాడైన ... ఆ వ్యక్తి గుణాలతో సంబంధం ఏమిటి ఆ ఇల్లాలుకి ?

''ఇందిరా ! ... '' సింహగర్జన లాంటి పిలుపుకి ఉలిక్కిపడి చూసింది ఇందిర.

ఆనాడు ఇందిర అని పిలిచిన పిలుపులోని మాధుర్యానికి, ఈనాటి పిలుపుకి ఎంత తేడా ?

''భర్త వచ్చినా ఏమిటో అంత పరధ్యానం ? ప్రొద్దున్న వచ్చిన కిషోర్‌గాడి అందాన్ని గుర్తు చేసుకుంటూ కలల లోకంలో ఉన్నవా ?''

''ఏమండీ ! ఏమిటా మాటలు. ప్చ్ ! కలల లోకం నాకెలా వస్తుందండి ? జరిగిన సంఘటనలో మీరు అనుమానించ తగ్గట్లు నేను ప్రవర్తించలేదే అని విచారిస్తున్నాను. ఎవరో అందమైతే ... ఎవరో ఎలాంటి వాడైతే నాకెందుకండి ? చీటికి మాటికి మిమ్ములను మీరే రూపంలో తక్కువ అని గుర్తు చేసుకుంటున్నారు కాని నేను ఊహకైనా మీ అందచందాలు తక్కువ అనుకోవడం లేదండి !''

''నోరుమూయ్ ! అధిక ప్రసంగం ! నాలో లోటుపాట్లు ఎత్తి చూపుతున్నావా ? ఎవడో ముక్కు ముఖం తెలియనివాడు వస్తే కాఫీ ఇవ్వవలసిన అవసరం ఏముంది ? వాడి అందం నిన్ను ఆకట్టుకోపోతే.''

ఆంధ్రపత్రిక
దినపత్రికలో
''మహిళావాణి''
చూశారా ?
దానిలో పాల్గొనండి !
దానిని చదవండి !!

''ప్లీజ్ ! దయుంచి మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడకండి. నన్ను ఇలా ఏడిపిస్తు ఉండే కన్నా ఒక్కసారి చంపేయండి'' అంది కళ్ళనీరు పమిటతో తుడుచుకుంటూ.

* * *

సాయంకాలం ఐదవుతుండగా ఇంటిముందాగిన కారుని చూసి ఆశ్చర్యపోయింది ఇందిర. ఎప్పుడు ఆరు దాటితేకాని రాని శేఖర్‌ని చూసి పెదవులపై నిర్లిప్తమైన నవ్వు బయలుదేరింది. ఇలా రావడం క్రొత్తకాదు. పెళ్ళయిన క్రొత్తలో తొందరగా ఇంటికి వచ్చిన శేఖర్‌ని చూసి పొంగిపోయేది. కాని తనతో సంబంధం లేకుండా ఇంటిలోపల గదులన్ని దేనికోసమో వెతికినట్లు కనబడే భర్తను చూస్తే... కొంచెం... కొంచెం అర్థమవసాగింది. ఎంత అవివేకి తన భర్త. కొందరి మగవాళ్ళలో కాస్త అనుమాన రేఖలు ఉంటాయి అనుకొంది క్రొత్తలో, కాని ఇంత అవివేకమా ?

''ఇందిరా ! ఎంతో సరదాగా ఇంటికి వచ్చాను. కాని నువ్విలా ఏదో పోగొట్టుకున్నదానిలా ఉంటావేం? నా సరదాల్ని, హుషారుని నీ ప్రవర్తనతో సమాధి చేసావ్ ?''

ఒక్క నిముషం ఇందిర కనుబొమలు ఆశ్చర్యంతో ముడిపడ్డాయ్ ! సూటిగా కళ్ళు ఎత్తి శేఖర్ వైపు చూసింది.

''టైమ్ అవుతుంది. పిక్చర్‌కి వెళదాం అని వచ్చాను, వస్తావా ? రావా ? చెప్పు ?''

''ఎంత చక్కగా పిలిచారు. భర్త భార్యను ఇలానే పిలుస్తాడు కాబోలు... తన బ్రతుక్కి సినిమా ఒకటి తక్కువైంది.''

''ఏం వస్తావా ? రావా ? ఏమిటా ఆలోచనలు. నాతో రావడం ఇష్టం లేకపోతే మానేయ్ ?''

''ఆహా... అలా అంటారు ఏమిటండి ? మీతో రావాలని ఉండకపోతే... మరెవరితో ఉంటుందండి ? ఒక్క నిముషంలో తయారై వస్తాను ఉండండి'' అని అక్కడనుండి వెళ్ళిపోయింది ఇందిర.

''ఇందిరా !...'' అని చప్పున తన హృదయం మీదకు లాక్కొని కౌగిట్లో బంధించి ''నువ్వు తయారు కానక్కరలేదు ఇందు, ఇలా ఎంత అందంగా ఉన్నావో తెలుసా ? పద టైమ్ అవుతుంది'' అన్నాడు శేఖర్.

ఎడారిలో పయనిస్తున్నవాడు నాలిక పిడచ కట్టుకుపోయి నీటిచుక్క కోసం పరితపిస్తున్నవాడిలా, ఆవేదనతో రగులుతున్న ఇందిర హృదయంపై పన్నీటిజల్లులా అనిపించాయి శేఖర్ మాటలు.

సినిమా చూసి కారు ఎక్కుతున్న ఇందిర మనసులో ఆనందం పరవళ్ళు త్రొక్కులోంది. ఇలాంటి జీవితం కోరుకుంది.

''ఏమండోయ్ !'' అని హడావిడిగా ఇందిర దగ్గరకు ఒక వ్యక్తి పరిగెట్టుకు వచ్చాడు.

ఇందిర కంగారుగా చూసింది.

''ఆ...నేను పోల్చుకున్నది నిజమే ! మీరు ఇందిర కదండి. అలా చూస్తున్నారు ఏమిటి ? నేను శ్రీను నండి ! శ్రీను అంటే గుర్తు లేనట్లుంది. బాబిని...అరె ఇంకా గుర్తులేనట్లుంది. శెలవులకి మీ తాతగారి ఊరు వచ్చేవారు. మీ తాతగారి ఎదురిల్లే మాది. ప్రొద్దున్నే లేచి నిద్ర ముఖంతోనే మా ఇంటికివచ్చి నన్ను ఆడుకోవడానికి రమ్మనేవారు. మనతో రాము, నిర్మల, శారద ఆడుకొనేవాళ్ళు. మిమ్ములను ఆఖరిసారిగా ఎస్.ఎస్.ఎల్.సి. ప్యాసు అయినప్పుడు చూసాను. చాలా మారిపోయారు. అందుకే గుర్తుపట్టలేక చూసి ... చూసి వచ్చాను.''

కొద్ది క్షణాలు వరకు ఏం మాట్లాడలేక పోయింది.

''అవునండి ! పోల్చుకోలేకపోయాను ! బాగున్నారా ? ఏం చేస్తున్నారు ?'' అంది ఏదో ఒకటి మాట్లాడాలి అన్నట్లు.

''ఆ ... బాగానే ఉన్నానండి. ఈ మధ్యనే ఈ ఊరువచ్చాను. ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాను. ఇన్నాళ్ళకు కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది.''

''... ... ... ... ... ...''

[38 వ పేజీ చూడండి]

## నేనెవరికోసం బ్రతకాలి ?



'భోగభాగ్యాలు'లో కృష్ణ, శ్రీదేవి

వేయసాగింది. వీడు నిజంగా ఇందుకేనా వచ్చాడు. లేక ఇందిరపై నెట్ ఏదైన విసిరి ... ''

''ఏమిట్రా అలా ఉన్నావ్ ?'' అని కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు కిషోర్.

''ఆ ... ఏం లేదురా ! ... '' అన్నాడు.

''వెళతానురా ! మీ మిసెస్ ఎక్కడా ! లోపలున్నట్లున్నారు. చెప్పరా వెళుతున్నట్లు, రేపు ప్రొద్దున్నే ఒకసారి డా॥ వెంకట్రావ్ దగ్గరకు రావాలి. నేనక్కడే ఉంటాను'' అని వెళ్ళిపోయాడు కిషోర్.

''రాస్కెల్ ! ఇప్పుడేం చెబుతావ్ ! లేనిపోని అనుమానాలతో బాధపెడుతున్నాను అన్నావే, నేను లేని సమయంలో వాడిని ఇంట్లో కూర్చోమంటావా?'' అని ఎర్రబారిన కళ్ళతో తీక్షణంగా చూడసాగాడు.

పరాకుగా కూర్చున్న ఇందిరకు శేఖర్ మాటలు మనసుని బాధపెట్టడం మొదలుపెట్టాయి.

''ఏమండీ... అతను...''

''ఛీ...ఛీ.. నీతో మాట్లాడడం బుద్ధితక్కువ. నీవు వాడితో సంబంధం పెట్టుకోవాలని ఉండబట్టే, నేను వాడు రోగ్ అని చెప్పినా తలుపు తీసి కూర్చోపెట్టావ్ ?''

''ఏమండీ ! ప్రతీ నిముషం అనుమానాలతో వేదించకండి. మనిషి ఆశాజీవి అని మీరే అన్నారు కదా ? ఆ భగవంతుని రోజూ మీలో బయలుదేరిన అనుమాన బీజాన్ని తొలగించమని కోరుతున్నాను. రోజు రోజు మీలో మార్పు వస్తుంది ఏమో అని ఆశతో జీవిస్తున్న నన్ను ఇలాంటి అనుమానాలతో బాధపెట్టకండి'' అంది.

''ఓహో ! చాలా పెద్ద స్పీచ్ ఇచ్చావే ! నీలాంటిదానికి భగవంతుడొకటా !'' అన్నాడు.

''స్త్రీని ఎంత తక్కువగా అంచనా వేస్తున్నారు. అతనెవరో చెడువాడైతే మీ భార్య గుణం కూడా చాపల్యం చెందుతుందనా మీ అభిప్రాయం ? ఎంత పొరబడుతున్నారండి ? తులసీవనంలో గంజాయి మొక్క పుట్టినట్లు ఎక్కడో ఎవరో బుద్ధిచాపల్యులు ఉంటారు ఏమోకాని భారత స్త్రీ కోరుకునేది భర్తనేనండి'' అంది ఏడుపుమధ్య.

''ఓహో ! నీలాంటిదో'' అన్నాడు గంభీరంగా శేఖర్.

''ఏమండీ ! ఇలాంటి మాటలతో నా మనసుని చిత్రవధ చేయడమే మీ ధ్యేయంగా పెట్టుకున్నారు. ఇన్నాళ్ళు మీరు మారుతారన్న ఆశతో మీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడినా సహిస్తూ వచ్చాను. ఇక నావల్ల కాదండి'' అంది బొంగురుపోయిన గొంతుతో ఇందిర.

''ఆహా !... అంతవరకు వచ్చావన్నమాట. నాకు తెలుసు నీ ఆంతర్యం. ఆనాడు నీగురించి అడుగగానే ఎంత తొందరగా ఒప్పుకున్నావో ? ఇప్పుడు ఈ వెధవ అందులోకి నాకన్నా అందగాడు అడుగాలేకాని...''

''ఆపండి మీ మాటలు ! మీరు ఏమన్నా సహిస్తూ వచ్చాననే ఇలా నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. మీరు లేనిపోని అనుమానాలతో బాధపెడుతున్నారు. కాని అసలు మీరు ఎప్పుడైన నా మనసు ఎటువంటిదో ఆలోచించారా ? నాకే అందంమీద మోజు ఉంటే ఆనాడు మిమ్ములను వివాహం చేసుకోవడానికి అంగీకరించేదానిని కాదు. నాకు కావలసింది బాహ్య సౌందర్యం కాదు మనిషి యొక్క...''

''నోరుముయ్ ! వెధవవాగుడు వాగకు. ఆనాడు నా ఆస్తి — అంతస్తు, నా కారు... నా లక్షల ఆస్తి చూసి చేసుకున్నావ్ ! అప్పుడు నా అందంతో సంబంధం లేదనుకున్నావ్ ! కాని ఇప్పుడు నీక్కావలసిన ఆస్తి నీ గుప్పెటిలో ఉంది. ఇక కావలసింది కిషోర్‌గాడిలాంటి —''

''ఛీ...ఛీ... మీరు... ఇంత సంస్కారహీనులు అనుకోలేదు. మీరు ఏవేవో ఊహిస్తున్నారే ఆ నిజాన్ని కళ్ళారా చూసారా ? ఏం చూసి నన్ను అనుమానంతో చంపుతున్నారు. మీరు... ఇక మారరు ! ఇన్నాళ్ళు ఎప్పటికైన మీ మనసు మారుతుంది అనుకున్నాను. కాని దేముడు మీకు మనసుకి బదులు రాతిగుండెని... ఛ...ఛ... దేనితో పోల్చిన మీకన్నా అదే నయం !''

ఇందిర రెండు చెంపలు వాచిపోయేటట్లు ఎంతసేపు కొట్టాడో శేఖర్‌కి తెలియదు. పళ్ళు పటపటా కొరుకుతూ ''నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నావ్ జాగ్రత్త'' అని మరల చేయి ఎత్తబోయాడు.

''హుం... కొట్టండి బాగా. నా ప్రాణాలు పోయేవరకు కొట్టండి. మీలాంటి అనుమానాల భర్తతో మనసుని చంపుకుంటూ కాపురం చేసేకన్నా చనిపోవటమే మంచిది.'' అని ఇక అక్కడ ఎంతోసేపు నిలబడలేనట్లు గబగబ అడుగులు వేసింది.

* * *

గదిలోకి వెళ్ళి మంచంమీద వాలిపోయింది ఇందిర. పెన్ను, డైరీ వెక్కిరిస్తున్నట్లుగా మంచం మీద ఉన్నాయి. అవి రెండు తను ఈ మూడేళ్ళు కాపురం చేయడానికి ఎంత సహాయపడ్డాయ్ ! మనసులో రగులుతున్న బాధ ఎవరితో చెప్పుకో గలదు ? చెప్పుకున్నా నలుగురి దృష్టిలో హీనం కావడమే తప్ప ఇక మిగిలింది ఏముంది? ఎవరితోనో చెప్పుకొని తన బాధ పోగొట్టుకోవాలి అని నిత్యం తన మనసు ఆరాటపడడం భరించలేక తన బాధ అంతా జీవంలేని ఆ పుస్తకంలో వ్రాసుకుంటే మనసుకి కొంత ఊరట కలిగేది. ఎప్పుడో ఒక్కరోజు తన భర్త తనతో మాట్లాడితే, తన మనసు ఆనందంతో పరవళ్ళు త్రొక్కేది. ఆయన మారతారు. నేనంటే ప్రేమ ఉంది అని పొంగి పోయేది ! కాని ... భగవాన్ శేఖర్‌కి ఎందుకు అలాంటి మనసు ఇచ్చావ్ అని పొంగిపొరులుతున్న దుఃఖాన్ని అదుపులోకి తెచ్చుకోవాలన్నట్లు పమిట కొంగు అడ్డంగా పెట్టుకొంది. మరు నిముషంలో ఏదో నిశ్చయించుకున్నదానిలా డైరీ తీసి వ్రాయడానికి నిశ్చయించుకొంది. చిన్నతనంలో తెలుగులో చదివినది గుర్తు వచ్చింది. శేఖర్ తను వ్రాసింది నమ్మతాడా ? అని, నిర్లిప్తమైన నవ్వు పెదాలపై బయలుదేరింది.

''ప్రియమైన శ్రీవారికి,

ఇందిర వ్రాయునది. నేను వ్రాసిన ఈ ఉత్తరం చదివి, నేను చనిపోయాకైన నిర్దోషినని మీరు ఒక్కసారి అనుకుంటే చాలు అని నా మనసు ఆరాటపడుతున్న, మీరు నా కోసం క్రొత్తగా లేని సంస్కారం తెచ్చుకోమని నేను చెప్పడంలేదండి. ఏమండీ ! మీరు ఆనాడు నన్ను వివాహం చేసుకోవడానికి అంగీకరించగలరా ? అని అడిగినప్పుడు నా మనసులో ఏ మారుమూలనో ఆనందం బయలుదేరిందనే చెప్పాలి. దానికి కారణం ఉన్నతమైన స్థానంలో ఉన్న ఒక సంస్కారవంతుడు ... ఒక మగాడు ఆడదానిని అలా అడగడం చాలా గర్వ కారణం అనే అనుకొన్నాను. మీ రూపం అప్పుడు నా కళ్ళముందు కనబడలేదు. మీరనుకొన్నట్లు మీ ఆస్తి... మీ కారు ఏవీకూడా నాకు కనబడలేదు. నాకు కలిపించిందల్లా ఒక్కటే ! మీరు నన్ను ఏరి కోరి వివాహం చేసుకుంటాను అని అడగడం. ఒక ఆడపిల్లకు అంతకన్నా కావలసినది ఏముంది ? కాని అప్పట్లో మీతో వివాహానికి అంగీకరించడానికి కారణం నాకు ఎదురైన రెండు జీవితాలే అని చెప్పాలి. ఆ రెండు జీవితాలు నా కళ్ళ ఎదుట కనిపించకపోతే మీరన్నట్లు కొందరి ఆడపిల్లల్లా కిషోర్ లాంటి అందమైన అబ్బాయిని వివాహం చేసుకోవాలని సెలక్ట్ చేసుకొనేదానిని ఏమో ! నా ఫ్రెండ్ రజనీ ఎంతో అందగత్తె

దానికి అందగత్తెనని, నాలా ఎవరూ లేరు అన్న అహం కూడా వుండేది! పెళ్ళి అంటూ చేసుకుంటే నా అందానికి పోటీ పడేవాడినే చేసుకుంటాను అని మా అందరితో అనేది. అలానే చేసుకొంది. కాని పెళ్ళి అయిన మూడు నెలలు తిరగకుండానే తెలిసింది. అతనికి ఒక అమ్మాయితో సంబంధం మూడు ఏళ్ళబట్టి ఉంది అని. దాని ఫలితం భర్తతో విడాకులు తీసుకొంది రజని. మా ఎదురింట్లో క్రొత్తగా వివాహం అయిన ఒక జంట దిగారు. ఆమె పెద్ద అందగత్తె కాదు కాని అతను చాలా అందగాడనే చెప్పాలి. ఇద్దరూ ఎంతో సరదాగా, హుషారుగా మోటరుసైకిల్‌మీద తిరిగేవారు కాని అప్పుడప్పుడు ఆమె ఎంతో దిగులుగా, పరధ్యానంగా ఉన్నట్లు కనిపించేది. కాని ఒకరోజు అకస్మాత్తుగా ఆమె చీరకు నిప్పు అంటించుకుని కాలిపోయింది. తరువాత తెలిసింది ఆమె భర్త వట్టి అనుమానాల మనిషి అని. ఈ రెండు సంఘటనలు నాలో ఏదో తెలియని మార్పు తెచ్చాయి. ఒక కాపురం బ్రతికినంత కాలం సుఖసంతోషాలతో ఉండాలంటే ఒక్క బాహ్య సౌందర్యం ముఖ్యం కాదు అని అప్పట్లో తెలుసుకున్నాను. దాని ఫలితమే ఇంట్లో ఎవరికి పెద్దగా ఇష్టం లేకపోయినా మీతో వివాహానికి అంగీకరించాను. కాని ఇప్పుడు తెలిసింది, మనిషిని చూసినంత మాత్రాన మంచి చెడు తెలుసుకోలేము అని! కాని మీరన్నట్లు మీ రూపం ఎలా వున్నా, కిషోర్ లాంటి వాళ్ళను ఎంతమందిని చూసినా, మన గడ్డమీద పుట్టిన స్త్రీ ఒకసారి భర్తచేత మూడు ముళ్ళు మెడలో కట్టించుకున్నాక, పరాయి పురుషుడిని మీరన్నట్లు... వ్రాయడానికే నా మనసు అంగీకరించడం లేదండి!

ఇన్నాళ్ళు నాలో రగులుతున్న బాధ మీకు తెలియజేయాలని వ్రాస్తున్నానే కాని మీరు నన్ను నిర్దోషిని అని నమ్మమని మీకు లేని సంస్కారాన్ని తెచ్చుకోమని నేను వ్రాయడం లేదండి.

కాని ... నేను బాధపడుతున్నదల్లా ఒక్కటే! భగవంతుడు ఆడదానికి అంత సున్నితమైన మనసు ఎందుకిచ్చాడు? భర్త తాగుబోతైనా, అనుమానితుడైనా, తిరుగుబోతైనా, ఆ నిముషంలో భర్త నడవడిక గూర్చి బాధపడుతుంది. కాని మరు నిముషంలో భర్తే తన సర్వస్వం అని ఎందుకు మురిసిపోతుంది? ఆడదానిలో ప్రేమ, మమత, అనురాగాలు అంత ఎక్కువగా ఎందుకు పెట్టాడు? మాలో పెట్టిన మమతానురాగాలలో కొంతైన మీలాంటి మగవాళ్ళలో పెడితే ఇప్పుడు నా జీవితం ఇలా ముగిసేది కాదు ఏమో కదండి? మీకు, నాలో ఇన్నాళ్ళు నేను అనుభవించిన బాధ మరోసారి ... మరోసారి తెలియాలి అని, మీరు ఇన్నాళ్ళు మీకు మీరే చులకన భావం ఏర్పరుచుకొని, నన్ను లేనిపోని అనుమానాలతో బాధపెట్టి నా మనసుని పూర్తిగా గాయపరిచారని మీకు వ్రాస్తే నమ్ముతారని వ్రాయడం లేదండి! కాని నేను తెలుసుకున్న సత్యం ఒక్కటే! మన గడ్డమీద మీలాంటి మగవాళ్ళు లేనిపోని అనుమానాలతో ప్రతీ నిముషం భార్యల పవిత్రమైన శీలాన్ని శంకించవచ్చు అని, ఆడవాళ్ళ అబలత్వాన్ని మీకు ఆహుతి చేసుకోవద్దని

# నేనెవరికోసం బ్రతకాలి?

రెండు చేతులు జోడించి కోరుతున్నాను. ఇప్పటికే మీకు సుదీర్ఘలేఖ వ్రాసి, మిమ్మలను విసిగించినందుకు క్షమించండి. ఈ లోకం నుండి నిష్క్రమించేలోగా మీకో విన్నపం వ్రాస్తున్నాను. దయుంచి ప్రాణంతో సమానంగా చూసుకొనే నన్నుక, భార్యను పోగొట్టుకొని ఆమెతో గడిపిన మధురస్మృతులలో కాలం గడుపుతున్న ఉన్నతుడైన వృద్ధాప్యములో ఉన్న నా తండ్రికి నా చావు ఎటువంటిదో మాత్రం తెలియజేయకండి.

స్త్రీకి యవ్వనం దశనుండి తనువుచాలించే వరకు భర్త చేదోడు వాదోడుగా ఉంటే భర్త తన సర్వస్వం అనుకుంటుంది. కాని ఏ ప్రేమ, ఆప్యాయత, అనురాగలు నోచుకోలేని నేను — "నేనెవరి కోసం బ్రతకాలి?" మీరే ఆలోచించుకోండి.

ఇట్లు
ఇందిర."


గమనించారా?

ఆంధ్రపత్రిక

దిన పత్రికలో

ఆ డ వా ళ్ళ కి

అ న్నీ

ఆ క ర్ష ణ లే

వెలువడుతున్నాయి!


వ్రాయడం పూర్తికాగానే ఇందిరలో ఎక్కడ లేనిశక్తి వచ్చింది. గబగబా అడుగులువేసి టేబుల్ దగ్గరకు వెళ్ళి స్లీపింగ్ టాబ్లెట్స్ గుప్పెడు చేతిలో వేసుకొంది. ఏదో కసి! తనమీద తనకు తెలియకుండానే తొందరగా వెళ్ళిపోవాలన్న ఆరాటం. నోరు తెరిచి గుప్పెడు నోటిలో వేసుకోబోయింది. అంతలోనే తన తొందరపాటుకి నవ్వువచ్చింది మాత్రలు వేసుకున్న వెంటనే తనకు తెలియకుండానే ఏదో నిస్సత్తువ బయలుదేరింది. నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ మంచం దగ్గరకు వెళ్ళి మంచంమీద వాలిపోయింది

తెల్లవారింది. బెడ్‌రూమ్‌లో అటు ఇటు కోపంగా, పచార్లు చేస్తున్నాడు శేఖర్. "ఎంత పొగరు ... పంతాలకి పోవడం నేర్చుకుంది. ఒక్కతి హాయిగా వెళ్ళిపడుకొంది" మనసులోనే గొణుక్కొసాగాడు శేఖర్.

వీధిలో బెల్ మ్రోగడంతో తలుపు తీసాడు శేఖర్.

"ఒరేయ్! నా ఫ్రెండ్ వైఫ్‌కి చాలా సీరియస్‌గా ఉందిరా! ప్రొద్దునుండి మనమీద తెలివేలేదు. నువ్వు ఒక్కసారి తొందరగా రారా" అన్నాడు గాభరాగా కిషోర్.

"ఇంకా ముఖమే కడుక్కోలేదురా, ఇదిగో ఒక్క నిముషంలో వస్తాను, కూర్చో" అని వెనుతిరిగాడు.

"అయ్యగోరు! ఎంతపని అయిపోనాది. అమ్మగోరు ... అమ్మగోరు..." అని ఏడవసాగింది గుండెలు బాదుకుంటూ లక్ష్మి.

"ఏమయింది అమ్మగారికి, చెప్పులక్ష్మి" అని కంగారుగా ఇందిర పడుకున్న గదివైపు నడవసాగాడు.

"ఇంకెక్కడి అమ్మగోరు! భగవంతుడా! ఎక్కడున్నావయ్యా ... దేవత లాంటి అమ్మగారిని తీసుకెళ్ళిపోయావు" అని గుండెలు బాదుకోసాగింది లక్ష్మి.

కిషోర్ లక్ష్మి మాటలు విని కంగారుగా శేఖర్ వెళ్ళిన గదివైపు పరిగెత్తాడు కిషోర్.

"ఇందిరా! ఎంత పని చేసావు! ఇందిరా! నువ్వు... నువ్వు ఇంత పని చేస్తావు అనుకోలేదు" అని మంచంమీద స్పృహ లేకుండా పడివున్న ఇందిర వైపు చూస్తూ, ప్రక్కనే ఉన్న డైరీని తీసి ఆత్రుతగా చదివి, "నేను మనిషిని కాను ఇందిర, పశువుని. అందరు ఆడవాళ్ళు లతలాంటి ఆడవాళ్ళే అనుకున్నాను కాని కొందరు నీలా మనసుకే ప్రాధాన్యత ఇస్తారు అని తెలుసుకోలేకపోయాను. నా కళ్ళనిండా అనుమాన పొరలు కమ్ముకున్నాయి. కాని మంచీ – చెడు ఆలోచించలేకపోయాను. నా ఆస్తి — అంతస్తు చూసి నువ్వు నన్ను వివాహం చేసుకున్నావు కాని నా రూపం అంటే ఏహ్యభావం నీ మనసులో ఉండే వుంటుంది అని నా మనసు శంకించేది. అందుకే ఏ మగాడు నిన్ను చూడకూడదు అని, నువ్వు ఏ మగాడిని కన్నెత్తి చూసినా నా రూపంమీద అసహ్యం బయలుదేరుతుంది అని, దాని ఫలితంగా నువ్వు నాకు కాకుండాపోతావు ఏమో అని భయం బయలుదేరింది. నేను బ్రతకడం వ్యర్థం" అని ఇందిరపై ఒరిగి, రెండు చేతులమధ్య ఇందిర ముఖం ఉంచుకొని, బోరున ఏడ్వసాగాడు శేఖర్.

ఇందిర ప్రక్కనే ఉన్న డైరీలో వ్రాసినది అంతవరకు చదివిన కిషోర్ నిశ్చేష్టుడయ్యాడు.

"శేఖర్!... నువ్వు ఇంత నీచుడివి అనుకోలేదు. దేవతలాంటి భార్యను చేజేతులారా చంపావ్! నేనెంత తిరుగుబోతునైన, జులాయివాడినైన అది ఇప్పుడు కాదే! కాలేజి జీవితం కొందరిని అధఃపాతాళానికి త్రొక్కుతుంది. కొందరిని ఉన్నత స్థానంలోకి తెస్తుంది. అధఃపాతాళానికి వెళ్ళినవాళ్ళు నిలద్రొక్కుకొని నిలబడినవాళ్ళు ఉన్నారు. స్నేహితుడి భార్య చెల్లెలితో సమానంరా! అయినా ఆ దేవత చెప్పినట్లు నీవు సంస్కారహీనుడివి" అని ఆవేశంగా అన్నాడు కిషోర్! ★


త్వరలో

నర్సింగ్ హోం